# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్యమాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor : J. C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 8 — మార్చి 1988 — సంపుటి 8

## సంపాదకీయము

### దేవుని యొక్క ముందు జాగ్రత్త

### *( The Providence of God )*

అనేక మంది క్రైస్తవులు ప్రతి విషయమును అదృష్టము లేదా దురదృష్టమని ఆరోపింతురు. ఎవరికైనను శుభము జరుగవలెనని కాంక్షించినపుడు ఈ మాట కంటె వేరొక మాటను కనుగొనుట కష్టము. మొదటి శతాబ్దమునందు మిషనరీలు ప్రార్థన, ఉపవాసములతో పంపబడిరని నేను సహోదరులకు అనేక పర్యాయములు చెప్పితిని. అయితే నేడు అట్టివారిని అదృష్టము లేదా దురదృష్టముతో పనిచేయుటకు పంపుచున్నాము. అదృష్టము అనునది అన్యులు ఉపయోగించు మాట గనుక క్రైస్తవులమైన మన పద జాలమునుండి ఆ మాటను తొలగింప వలసి యున్నది. కావున క్రైస్తవులైన మనము అదృష్టమును అధిగమించి పనిచేయవలసి యున్నది.

మన జీవితములో ఏమి సంభవించినను అట్టిది ఆకస్మికముగా లేదా కాకతాళీయముగా సంభవించిన సంఘటన అయినప్పటికి అట్టి

వాటిని గూడ అదృష్టము లేదా దురదృష్ట మని ఆరోపించుట కద్దు. అందువలన మన మేమి నమ్మినను మన జీవితములో ఏమి సంభవించినను వాటి కన్నిటికి అదృష్టమే కారణమను భావము మనకు గలదని మన మాటలను వినువారు అభిప్రాయపడుదురు.

మరియొక మాటలో చెప్పవలెననిన, మన జీవితములోను క్రైస్తవుల జీవితములలోను దేవుడెట్లు పనిచేయుచున్నాడో గ్రహించుట కష్టము. మన కుటుంబము, సహోదరులు స్నేహితులు మన చుట్టూ గలరు. మనకు ఏదైన సహాయము అవసరమైనచో వారి యొద్దకు వెళ్ళుదుము. అయితే దేవుని సహాయముకొరకు మనము అడుగ వచ్చును. అయినప్పటికి ఆయన తప్పక సహాయము చేయునని మనము ఎదురుచూతుము.

అయితే లోకములో పనిచేయుచున్న అనేక మంది బోధకులు తమ జీవితములో దేవుని యొక్క ముందు జాగ్రత్త చర్యను సులభముగా గ్రహింపగలరు. వారు ఎదుర్కొనుచున్న సమస్యలను పరిష్కరించుటకు ఏ సహోదరుని యొక్క సహాయము వారికి అవసరములేదు. వారిని త్రిప్పుటకు ఇతరుల సహాయము అవసరములేదు. కాబట్టి వారు దేవుని వైపు చూచి, తమ్మును తాము దేవునికి అర్పించుకొని ఆయన తమ ద్వారా పనిచేయుటకు యిష్టపడినప్పుడు ప్రభువు నిజముగా తమకు తోడుగా నుండి సహాయము చేయుచున్నాడని గ్రహింపగలరు. అయితే అది ఆకస్మికముగా జరిగినది గాని, కాకతాళీయముగాని, అదృష్టముతో జరిగినది గాని కాదు. పైగా దేవుడు పనిచేయుచున్నాడని గ్రహింప వచ్చును.

నేడు దేవుడు తన వాక్యబోధకు విరుద్ధముగా అద్భుతములు, సూచకక్రియలు, మహత్కార్యములు, దర్శనముల ద్వారా పని చేయుటలేదు. అయితే ఇంకను ఆయన పని చేయుచున్నాడు. మానవుడు చట్టములు, పరికరములు, ఔషధములు, భౌతిక వస్తువులు,

ధనము యింకను అన్నిరకములైన విషయముల నుపయోగించి ఇతరులకు సహాయము చేయును. ఇందులో అద్భుత మేమీలేదు. తనకు చేరువలో నున్నవాటిని అతడు ఉపయోగించినాడు. తన ప్రజలను ఆశీర్వదించుటకు దేవుడు కూడ అదే విధముగా ఎందుకు చేయడు? ప్రకృతి శాసనానుసారముగా నున్న విషయముల ద్వారాను, అందలి నియమముల వలనను, తనకు చేరువలోనున్న వాటి ద్వారాను ఆయన తన ప్రజలకు సమస్తమును సాధ్యపరచుచున్నాడు; అట్లే దేవుడు తనకు అందుబాటులోనున్న వాటినన్నిటిని ఉపయోగించి ఆయనకు విధేయులగు వారినందరిని దీవించుచున్నాడు.

"దేవుని ప్రేమించు వారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమా 8 : 28). ఇవి అపొస్తలుడైన పౌలు వ్రాసిన మాటలు. అయితే క్రీస్తు మాటలను గమనించుము, "ఇదిగో ఈయుగ సమాప్తివరకు సదాకాలము మీతో ఉందును." (మత్త 28 : 20). "నేను నిన్ను ఎన్నడును విడువను, ఎన్నడును ఎడబాయను" (హెబ్రీ 13 : 5). దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు? అని పౌలు వ్రాయుచున్నాడు (రోమా 8 : 31). "అయినను మనలను ప్రేమించిన వాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము" (రోమా 8:37). మరియొక సందర్భములో పౌలు యిట్లనుచున్నాడు: "మనము అడుగు వాటన్నిటికంటెను, ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక. ఆమేన్" (ఎఫెసి 3 : 20, 21). "మరియు అన్నిటియందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వసమృద్ధి గలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింప చేయగలడు". (2 కొరింథి 9 : 8.)

నా సహోదరులారా, దేవుడు నేడు పనిచేయుచున్నాడు. ఆయన పనిచేయకున్నచో తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మనము ఎందుకు దేవుని ప్రార్థించుచున్నాము? ఆయనకు నీపట్ల సంకల్పమును నీలో జరిగించుటకు నీవు యిష్టపడనిచో దేవుడు నీలోను నీద్వారాను పనిచేయడు. నీకు అనుగ్రహింపబడిన తరుణముల ద్వారా నీవు ప్రయాణింపనిచో ఆయన నీకెట్లు సహాయపడును? ఆయన చిత్తమును నెరవేర్చుటకు నీవు దేవుని అనుమతించిన యెడల ఆయన నిన్ను దీవించి నీకు విస్తారముగా మేలు చేయువాడుగా నుండ వలెనని కోరుచున్నాడు.

---

## "విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము"
(1 తిమోతి 6 : 12).

మానవులు అనేకరీతులుగా అనేక విషయాల కొరకై పోరాడుదురు. క్రీడారంగములో పాల్గొను వారందరు తాము పాల్గొను పోరాటములో పోరాడి జయించి బహుమానము పొందవలెనని తలంచుదురు. అటులనే ఇంకనూ అనేకమైన లోక విషయాలు కలవు. ధనము, పలుకుబడి, పదవులు మొదలగు వాటికై పోరాడుదురు. క్రైస్తవుడు కూడా పోరాడువాడై యున్నాడు. అయితే ఈ పోరాటము "శరీరులతో కాదు గాని ప్రధానులతోను అధికారులతోను ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశ మండల మందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాడు" (ఎఫెసీ 6 : 12). క్రైస్తవుడు పోరాడువాడై యున్నాడు, ఎందుకనగా :-

(1) పరలోకమునకు వెళ్ళుమార్గము సులభమైనది కాదు. 'ఇరుకు ద్వారమున ప్రవేశించుడి... జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది. దాని కనుగొనువారు

కొందరే' (మత్తయి 7:13, 14). "శిష్యులను మనస్సులను ధృఢపరచి, విశ్వాసమందు నిలకడగా ఉండవలెననియు, అనేక శ్రమలను అనుభవించి దేవుని రాజ్యములో ప్రవేశింపవలెననియు వారిని హెచ్చరించిరి" (అపొ. కా. 14 : 22).

(2) క్రైస్తవ జీవితము సంతోషముతో కూడినదికాదు. ఆదిమ సంఘములోని వారికి హింసలు కలిగెను. (అపొ. కా. 8:1-4). సౌలు అనేకమందిని హింసించి చెరసాలలో వేయించెను. వారు ఇతర ప్రాంతములకు చెదరి పోయిరి. యోహాను పత్మాసు ద్వీపములో పరవాసిగా ఉండెను. శిష్యులు భయంకరమైన మరణము అనుభవించిరి. బైబిలును చదువనియ్యని రాజులు అనేకులు వచ్చిరి. కనుక క్రైస్తవుడు శోధనలు ఈ విధముగా కలుగునప్పుడు ఎదుర్కొను ధైర్యము కలిగి యుండవలెను. ప్రభుత్వ పరముగా గాని కుటుంబ పరముగా గాని శోధనలు కలుగుటకు అవకాశమున్నది. కనుక క్రైస్తవుడు ప్రభువునందు మాత్రమే ఆనందించగలడు (ఫిలిప్పీ 4 : 4). క్రైస్తవజీవితము దేవుని అంగీకరించుట, ఆరాధించుట, ఆజ్ఞలను పాటించుట, వాక్యము ప్రకటించుట, శ్రమలను అనుభవించుట మొదలగువాటితో నిండియున్నది.

క్రైస్తవ పోరాటము అనగా క్రీస్తు నిమిత్తమై శ్రమలను అనుభవించుట, ఆయన ఆజ్ఞలను పాటించుటలో కలుగు శోధనలు. అయితే పౌలు విశ్వాస పోరాటమును పోరాడిన వాడుగా కనబడుచున్నాడు. (2 కొరిం 7 : 5; 4 : 8; 2 తిమోతి 4 : 7).

## పోరాటమును కలుగజేయు సంగతులు

(1) మానవుని శరీర బలహీనత :- ఇట్టి మరణమునకు లోనైన శరీరమునుండి నన్ను ఎవడు విడిపించును" అని పౌలు చెప్పుచున్నాడు. మేలు చేయవలెనని తలంచితే కీడు చేయుట జరుగుచున్నదని చెప్పు

చున్నాడు. కనుక వీటి మధ్యపోరాటం కనబడుచున్నది. (రోమా 7 : 15-24). "ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనమని క్రీస్తుచెప్పెను" (మత్తయి 26 : 41). కొన్ని పర్యాయములు మన శరీర అనారోగ్యం వలన ప్రభువు పనులకు హాజరు కాలేక పోవచ్చును.

(2) ప్రభువు పనిని స్వల్పంగా ఆలోచించుట: ప్రభువు సముద్రంలో చేపలు పట్టుమని పేతురుతో అనగా పేతురు ఏలినవాడా రాత్రింతయు వలలు వేసితిమి గాని ఒక్క చేప కూడా దొరకలేదని చెప్పెను (లూకా 5 : 4-7). అనగా పేతురు ప్రభువు యొక్క శక్తిని స్వల్పంగా చూచెను. అలాగే బోధకులు తక్కువ మందికి వాక్యం ప్రకటించుట, తప్పిపోయిన వారి యెడల బాధ్యత లేకపోవుట కూడా పోరాటమును కలుగజేయును.

(3) లోక సంబంధులు దేవునికి వ్యతిరేకులు అగుటవలన: "యన్నే, యంబ్రే అనువారు మోషేను ఎదిరించిరి" (2 తిమోతి 3 : 8). "యెరూషలేమును పునరుద్ధరించుచున్న నెహెమ్యాను సమరయులు ఎదిరించిరి." (నెహెమ్యా 6 : 1-9). "ఎలుమ అనబడిన గారిడివాడు సెర్గి పౌలు అను అధిపతిని దేవుని యందు విశ్వసింప నీయకుండా చూచెను." (అపొ. కా. 13 : 6-11). "అలెక్సంద్ర అను కంచరివాడు పౌలును ఎదిరించెను." (2 తిమో 4 : 14, 15). ఈ విధముగా మనకు పోరాటము కలుగుచున్నది.

(4) తోటి పనివారు నీ యొద్దనుండి వెళ్ళినప్పుడు:- ఆసియ లోని వారు నన్ను విడిచి పోయిరి అని పౌలు 2 తిమోతి 1 : 15లోను, ఎవడును నా పక్షమున నిలువలేదు అని 2 తిమోతి 4 : 16-17 లోను పౌలు చెప్పుచున్నాడు. కనుక ఇతరులకు వాక్యం ప్రకటించు భారము మన మీద మరింత పడినది కావున పోరాటము కలుగుచున్నది.

## పోరాటమును జయించు విధానము

(1) శ్రమలను అనుభవించుటకు ఇష్టపడవలెను. శ్రమలులేని

వాడు క్రైస్తవుడు కాడు. "క్రీస్తుయేసు నందు సద్భక్తితో నుండగోరు వారికి శ్రమలు కలుగును" (2 తిమోతి 3 : 12). "నా నిమిత్తం జనులు మిమ్మును నిందించి హింసించి..." (మత్త 5 : 11). "నన్ను వెంబడింప గోరువాడు తన శిలువ నెత్తుకొని నన్ను వెంబడించవలెను" (లూకా 14 : 27).

(2) మన సమయమును, ధనమును, కుటుంబమును, ఆనందమును త్యాగము చేయుటకు ఇష్టపడవలెను :- "సమయమందును అసమయమందును వాక్యము ప్రకటించుము" ( 2 తిమోతి 4 : 2). "దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి ఇబ్బందులలో పరామర్శించవలెను" (యాకో 1 : 27). "ప్రతి ఆదివారమున చందా ఈయవలెను" (1 కొరిం 16 : 1, 2). "తల్లిని, తండ్రిని, భార్యా, భర్తను క్రీస్తు కంటె ఎక్కువగా ప్రేమించరాదు" (మత్తయి 10 : 37).

(3) మన తలాంతును సరిగా వినియోగించుకొనవలెను. కుంచము క్రింద పెట్టిన దీపము వలెను, భూమిలో దాచిన తలాంతువలె కాక ఇతరులకు మన ప్రవర్తన మాదిరిగా కనిపించవలెను.

(4) ఒకరి నొకరు బలపర్చుకొనుడి : శ్రమలు సంభవించిన సహోదరుల నిమిత్తమై సభ్యులందరూ ప్రార్థన చేయవలెను. "మీరు ఒకరి భారము ఒకరు భరించవలెను" (గలతి 6 : 2). "బలహీనులకు చేయూత నియ్యుడి" (రోమా 15:1). "ఒకరి విశ్వాసము చేత ఒకరు ఆదరణ పొందుడి" (రోమా 1 : 11).

(5) మన నాయకుడు, రాజు అయిన క్రీస్తు మనకు ఉన్నాడు. "ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతో ఉన్నాను" (మత్తయి 28 : 20). "నిన్ను ఏమాత్రము విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ప్రభువు చెప్పుచున్నాడు" (హెబ్రీ 13 : 6).

(6) పాతనిబంధనలోని విశ్వాస వీరులు మాదిరిగా ఉన్నారు. నోవహు, అబ్రాహాము, మోషే, హింసింపబడిన ప్రవక్తలు మాదిరిగా ఉన్నారు. (హెబ్రీ 11 అధ్యాయం).

## జయము పొందుట తథ్యము

"నీకు విరోధముగా ఉన్న ఏ ఆయుధము వర్ధిల్లదు." (యెషయా 54 : 17). "లోకమును మన విశ్వాసమే జయించును" (1 యోహా 5:4) అయితే మరణమువరకు నమ్మకంగా ఉండవలెను (ప్రకటన 2:10). సాతాను కలుగజేయు శోధనలు ఎదుర్కొనుటకు ఒక సైనికునివలె ఉండవలెను. దేవుడు మనకు ఆయుధాలు ఇచ్చియున్నాడు. ఎఫెసీ 6 : 13-17 వచనాలలో తెలిసికొనగలం. అవేమనగా సర్వాంగ కవచం, సత్యమనుదట్టి, నీతియను మైమరవు, సువార్తవలనైన సిద్ధ మనస్సను జోడు, విశ్వాసమను డాలు, రక్షణయను శిరస్త్రాణము, ఆత్మ ఖడ్గము కనుక నీవు ఇప్పుడు క్రీస్తు యేసు యొక్క సైనికునివలె పోరాటము పోరాడుము. నీవు తప్పక జయింతువు. పౌలు అయితే పోరాడినాడు. తన కొరకు నీతి కిరీటము ఉంచబడి యున్నదని చెప్పుచున్నాడు. మనకు కూడా కలదని ఆయన చెప్పుచున్నాడు. (2 తిమోతి 4 : 7, 8).

ప్రభువు పనియందు ఆసక్తి గలవారమై యుండుము. లోకాశలను విసర్జించుము, ప్రతిభారమును, సులువుగా చిక్కులబెట్టు పాపమును విడిచి విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడైన యేసువైపు చూచుచు పందెములో ఓపికతో పరుగెత్తుము. మంచి పోరాటము. నిత్యజీవమును చేపట్టుము.

D. చిరంజీవి
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

---

## మీకన్నులెత్తి కోతకు వచ్చిన పొలాల్ని చూడండి
## (Lift up your eyes unto fields that are white unto Harvest)

—జె. సి. బెయిలీ.

యేసు చేసిన ఈ సవాలు యోహాను 4:35లో యున్నది. ఇండియా ఈ సవాలును స్వీకరిస్తుందా? కోత కాలము ఇప్పుడే.

ప్రపంచములో కెల్ల గొప్ప ఆత్మల పంటగా ఇండియాను మనం చేయగలం. ఏ పరిమిత భావమందును (exclusive sense) క్రైస్తవ్యము పాశ్చాత్యుల మతము కాదు. దేవుడు లోకాన్ని ప్రేమించాడు. యేసు మానవు లందరి కొరకు మృతి నొందాడు. ఇండియాలో ప్రభువు సేవయందు క్రైస్తవ్యము దానియొక్క సరియైన స్థానాన్ని పొందకుండా మిషను తత్వము (mission concept) అడ్డు పడింది. గాని విశ్వాసముద్వారా అది మార్పు నొందగలదు. దేవుని వాక్యను వినండి: "..లోకాన్ని జయించిన విశ్వాసము మన విజయమే" (1 యోహాను 5:4).

## అన్ని జనాంగములకు సంఘం

దేవుని సంకల్ప ప్రకారం సంఘం అన్ని దేశాలకు చెందవలసి యుండెను. "అంత్య దినాల్లో యెహోవా మందిర పర్వతము పర్వతములపైన పర్వత శిఖరాన స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడుతుంది. ప్రవాహం వలె సమస్త అన్యజనులు దానిలోనికి వస్తారు" అని యెషయా 2:2లో చదువగలం. దేవుని మందిరమే దేవుని సంఘమని పౌలు మనకు చెబుతున్నాడు (1 తిమోతి 3:15). గనుక ఒక దేశానికి ఒక సంఘం మరో దేశానికి మరో మిషను (mission) లేదు. ఈ మార్గదర్శక సత్యాన్ని బట్టి, మనం ఏ సంఘములో యుండి క్రీస్తును సేవించాలో దాని కొరకే ఆయన మృతి పొందాడు. మనం కృషి సల్పుటకై విశ్వాసం ద్వారా సిద్ధపడదాం: "మనలో కార్య సాధకమైన తన శక్తి చొప్పున మనం అడుగు వాటన్నిటి కంటె ఊహించు వాటన్నిటికంటె అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి యేసుక్రీస్తు మూలముగా సంఘములో తరతరాలు సదాకాలం మహిమ కల్గునుగాక. ఆమేన్" (ఎఫెసీ 3:20, 21). మనం అడిగేదాని కన్నా తలచే దానికన్నా దేవుడు ఎక్కువగా చేయ సమర్థుడు. మరొక మాటలో, మనం సంఘం ద్వారా కృషిచేస్తే మనం ఊహించే దాని

కంటె దేవుడు ఎక్కువ చేయగలడు. నా సోదరుడా, సంఘం నీది. మన కేం కావాలి? విశ్వాసం. "దేవుడు తన ఐశ్వర్యం చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరం తీరుస్తాడు" (ఫిలిప్పీ 4 : 19).

## విశ్వాసము ద్వారా విజయం

మనకు బోధకలుగుటకై పాతనిబంధన వ్రాయబడింది. పూర్వ కాలపు తన జనులకు దేవుడు కనాను దేశాన్నిస్తానని వాగ్దానం చేసాడు. దాని కొరకై వారు ఐగుప్తును వదలివలసి వచ్చింది. వారు గైకొనటానికి నిజదేవుడు వారికొరకు చట్టాన్ని సీనాయి నొద్ద యిచ్చాడు. త్వరలోనే వారు వాగ్దాన దేశపు సరిహద్దులవరకు వెళ్ళారు. దేవుడు వాగ్దానం చేసిన ఆ దేశాన్ని చూచివచ్చుటకు వారు గూఢచారులను పంపారు. ఆ దేశపు మనుష్యులు బలిష్టులు ఎత్తరులై యుండిరి. దేవుని సహాయంతో వారిని జయించగలమని ఆ గూఢ చారుల్లో ఇద్దరన్నారు. మనం ఆ దేశాన్ని జయించలేమని పదిమంది గూఢచారులన్నారు. ప్రజలు ఆ పదిమంది చెప్పిన మాటనే విన్నారు. పిమ్మట అరణ్యానికి మరలిపోయి వారందరు చనిపోయేవరకు వారు అక్కడే 40 ఏండ్లు సంచరించారు, నిర్ణయించుకోవలసింది మనమే: ఔను, దేశములో బలాఢ్యులున్నారు, గాని దేవుడు మన పక్షా న్నుండగా మనకు శత్రువెవడు? విశ్వాస నీయులైన ఇద్దరు గూఢ చారులవలె మనముందామా? లేక అవిశ్వాసులైన పదిమంది గూఢ చారుల వలె యుందామా?

ఇది మన శరీరపు రంగుకు మన జాతీయతకు కులానికి సంబం ధించిన విషయం కాదు — "యేసు క్రీస్తునందుండు వారికి సున్నతి పొందుటలో యేమీలేదు, పొందక పోవుటలో యేమీ లేదు. గాని ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును" (గలతీ 5 : 6).

దేవుడు మనల్ని ప్రేమించాడు. ప్రేమ పరస్పర పూర్వక మైనదై యుండాలి. "ఆయనే మొదట మనలను ప్రేమించాడు గనుక మనం ఆయన్ని ప్రేమిస్తున్నాం" (1 యోహాను 4 : 19). నీవు ఆయన్ని ప్రేమిస్తున్నావా? ఇదిగో పరీక్షించుకో: "మీరు నన్ను ప్రేమిస్తున్నట్లయితే నా ఆజ్ఞలు గైకొనండి" (యోహాను 14 : 15). "మీరు సత్యాన్ని తెలుసుకొంటారు, సత్యము మిమ్మల్ని స్వతంత్రులనుగా చేస్తుంది" (యోహాను 8 : 32). సత్యము నెరిగినవారు అనేకులున్నారు. సువార్తకు విధేయుడగుట వలన నీవు స్వతంత్రుడవు. నీవు సత్యాన్ని తెలుసుకొనుట వలన రెండింతలు స్వతంత్రుడవు. రాజకీయ స్వాతంత్ర్యము సాధించటానికి ఇండియా ఎంతో కృషి చేసింది.

నీ పాపాల నుండి దుర్బోధల నుండి స్వాతంత్ర్యం పొందటానికి నీకు స్వేచ్ఛయుంది. ఇప్పుడు సిద్ధపడి దేశాన్ని స్వాధీన పరచుకొనుటకు మనకు విశ్వాసమున్నదా?

విజయ సిద్ధికి మించిన దేదియులేదు. ఎర్ర సముద్రాన్ని దాటించ గల్గిన దేవుడు అన్ని వ్యతిరేక శక్తులను ఓడించి తమను కనానును కొనిపోగల సమర్థుడని ఇశ్రాయేలీయులు నమ్మియుండవల్సింది. మనం దేవుని యొక్క సర్వాంగ కవచమును ధరించుకొన్నట్లయితే మన విశ్వాస ప్రేమలను బట్టి క్రీస్తు ద్వారా దేవుడు గొప్ప విజయాన్ని సిద్ధింపజేయగలడు. అయితే మనం విశ్వసించవలసిన రీతిగా విశ్వసించాలి; ప్రేమించవలసిన విధంగా ప్రేమించాలి.

విశ్వాసమును బట్టి కార్యసాధకమైన ప్రేమవలన మొదటి శతాబ్దపు వారివలె గొప్ప విజయాన్ని పొందగలం. మనం పోయి యేసు క్రీస్తు నామాన్ని దేశాన్ని స్వాధీనపరచు కొందమా? అవసరమైన అన్ని హంగులు మనకున్నాయి. వాటిని మనం వినియోగిద్దామా? లేక సాకులు చెప్పుదమా?

మన ముందర క్రైస్తవ సైనికులు క్రీస్తు సిలువతో యుద్ధానికి సాగుచున్నారు. పౌలుతో సహా నన్ను ఈ మాటలు చెప్పనీయండి: "మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానముపై గాక దేవుని శక్తిపై ఆధారపడి యుండవలెను" (1 కొరింధీ 2:5). ప్రభువు జాప్యము చేస్తే, 1988 వ సంవత్సరము ప్రభువు పని విషయములో ఇంతకుముందెన్నడు లేనంత గొప్ప సంవత్సరమై యుండగలదు, యుండాలి.

విశ్వాసముతో పౌలుతో బాటు చెబుదాం: "...నేను నమ్మిన వానిని ఎరుగుదును... నేను ఆయనకు అప్పగించిన దానిని ఆ రోజు వచ్చున్న ఆ దినము వరకు కాపాడగలడని రూఢిగా నమ్ముచున్నాను" (2 తిమోతి 1:12).

---

## శారా (SARAH)

— విక్టర్ డి. తురకా, తెనాలి.

శారా, అబ్రాహాము భార్య అని బైబిలు పరిచయమున్న వారందరికి తెలిసిన విషయమే-దేవుడు సర్వమానవులను రక్షించుటకు తయారు చేసిన తన రక్షణ పథకమును ఆరంభించుటకు ఈ చిన్న కుటుంబమును ఎన్నుకొనెను.

వీరి జన్మస్థలము కల్దీయుల ఊరు అను పట్టణము. ఈ పట్టణము ఏదేను తోటకు ఉత్తరముగా 12 మైళ్ళ దూరములో వున్నటులను, జల ప్రళయమునకు పూర్వము నుండియు ఒక గొప్ప పట్టణముగా విలసిల్లు చుండి నటులను, జలప్రళయములో నాశనమైన తరువాత అదే ప్రాంతములో ఒక పట్టణము తిరిగికట్టబడి, ఒక గొప్ప ఓడరేవుగా వృద్ధి పొంది, పారిశ్రామిక పట్టణముగా ప్రసిద్ధిపొంది, రాగి, యినుము మొదలగు ఖనిజములను ఎగుమతి చేయుచుండినటుల చారిత్రక ఆధారములు కలవు. ఆచాము హవ్వలు తమ మహిమను పోగొట్టుకొనిన స్థలమైన

ఏదేను తోట ప్రాంతము నుండియే, మానవాళిని రక్షించుటకు వాగ్దానము చేయబడిన రెండవ ఆదాము అయిన యేసుక్రీస్తు వంశావళి ఆరంభ కర్తలుగా అబ్రాహాము శారాలను 'ఊరు' నుండి ఎన్నుకొనుట ఎంత అద్భుతము: వారు ఆదాము హవ్వల చరిత్ర తెలిసియుండిరనుటలో సందేహములేదు. వారు నోవహు వంశీయులని వారికి తెలుసు. ఆదాము ద్వారా మెతూషెలకును, మెతూషెలద్వారా నోవహుకును, నోవహునుండి తెరహు ఏదేను తోట సమాచార మంతయు తెలిసికొనియుండును. తెరహు విగ్రహారాధికుడును, విగ్రహములను చేయువాడునై యుండెను. ఊరు పట్టణస్థులు చంద్రదేవతా రాధికులు. చంద్రదేవతను 'నినా' పేరుతో పూజించుచుండిరి. ఈ'నినా' దేవత పేరనే 'నినవే' పట్టణము కట్టబడెను. అట్టి విగ్రహారాధన వాతావరణంలో పెరిగిన అబ్రాహాము శారాలు నిజదేవుడైన యెహోవా యందు విశ్వాసమెట్లుంచిరో, అట్టి దేవుని ఆజ్ఞానుసారముగా 'ఊరు'ను, తమ బంధుమిత్రులను విడచి ఎట్లు, గమ్యమెరుగని చోటునకు బయలుదేరిరో మనకు అగమ్యగోచరము : ఆ రోజులలో వారికి దైవగ్రంథము లేదు-వారు ఎట్టి ప్రసంగములను వినలేదు - నిజదేవుని గూర్చి పుస్తకముల యందు చదువలేదు, అయినను వారు నిజదేవుని ఆజ్ఞకు విధేయత చూపినారంటే - వారికి తెలియకుండగనే - 'సర్వ మానవ రక్షణార్థమైన దేవుని నిత్యసంకల్పమునకు ప్రారంభకులుగా వారి యందు దేవుడే తన అక్షయ బీజమును నాటినట్లు మనము గ్రహించగలము. ఈ యేర్పాటంతయు ఆదాము హవ్వలకు యివ్వబడిన వాగ్దాన ప్రకారము - స్త్రీ సంతానమైన క్రీస్తును భూలోకమునకు తెచ్చుటకేనని యిప్పుడు మనకు విశదమై యున్నది. దేవుడు సంకల్పించిన రక్షణపథకము అబ్రాహాము శారాల ద్వారా ప్రారంభమై యేసు క్రీస్తు నందు ముగియుచున్నది - అట్టి రక్షణ పథకము తన ప్రయాణమును మొదలుపెట్టినది - దేవునితోను, దేవుని తీసుకొని అది

ప్రియాణించుచున్నది - ఏదేను తోటలోని విషాదాంత సంఘటనకు నివృత్తి కలుగబోవుచుండెను - దీనిలో అబ్రాహాము శారాలు నిమిత్త మాత్రులు మాత్రమే అసలు నాయకుడు దేవుడే. దేవుడు తాను ఎంతగానో ప్రేమించిన ఈ లోకమునకు చేయబోవుచున్న గొప్ప ప్రేమ కార్యము యొక్క ఆరంభమే యిది. ఈ ప్రేమ కార్యము క్రీస్తు బలితో నిలిచిపోక, యిప్పటికిని మన యందును అమలు జరుగు చున్నది - తన రెండవ రాకడవరకు అమలు జరుగుచుండవలెనని దేవుని చిత్తమైయున్నది.

మొదటిలో వీరి పేర్లు 'శారాయి', 'అబ్రాము'లు. యెహోవా దేవుడే స్వయముగా ఆమె పేరును 'శారా'గా మార్చెను - 'శారా' అనగా "రాజకుమారి" అని అర్థము. పేరు మార్చుటకు కారణమును కూడా యెహోవా దేవుడే తెలిపెను - "నేనామెను ఆశీర్వదించి ఆమె వలన నీకు కుమారుని కలుగజేసెదను; నేనామెను ఆశీర్వదించెదను, ఆమె జనులకు జననియై యుండును; జనముల రాజులు ఆమె వలన కలుగుదురని చెప్పెను." (ఆది 17 : 16).

అదే విధముగ దేవుడు 'అబ్రాము' పేరును కూడా 'అబ్రాహాము'గా మార్చెను; అనగా అనేక జనములకు జనకుడని అర్థము (ఆది 17 : 5). 'శారయి', 'అబ్రాము'ల పేరులను మార్చుటలో, ఆ పేరులకు, హెబ్రీ బాషలో "హే" అక్షరమును (ఇంగ్లీషులో H అను అక్షరమును) రెండు పేర్లలో కలిపి క్రొత్త పేర్లు చేసెను - Abram-Abraham; Sarai - Sarah; ఈ 'హే', H అను అక్షరము, యెహోవా YAHWEH పేరులోని భాగము-అనగా దేవుడు - అబ్రాహాము, శారాలను, తన రక్షణ పథకమందు ఏకీభవింపజేసినట్లు గుర్తని, క్లాడియస్ వేదాంతపండితుడు అభిప్రాయపడెను. ఆదికాండము పద కొండవ అధ్యాయము యిరువది తొమ్మిదవ వచనములో - 'అబ్రాము' భార్య పేరు 'శారాయి' అని, 'శారా' మనకు పరిచయము చేయబడెను.

తెరహు తన కుమారుడగు అబ్రామును, తన కుమారుని కుమారుడగు, అనగా 'హారాను' కుమారుడగు 'లోతు'ను, తన కుమారుని భార్య యయిన 'శారయి' అను తన కోడలిని తీసికొని 'కనాను'కు వెళ్ళుటకు కల్దీయుల 'ఊరు' నుండి వారితో కూడా బయలుదేరి హారాను మట్టుకు వచ్చి అక్కడ నివసించెను. తెరహు విగ్రహారాధికుడు, విగ్రహము లను తయారు చేయువాడని, స్వయముగ 12 దేవతలను పూజించెడి వాడని, యూదుల ప్రాచీన గ్రంథము నుండి తెలియుచున్నది - BER, RAB, 17- "ఆదికాలము నుండి మీ పితరులు, అనగా అబ్రాహాముకును, నాహోరుకును తండ్రియైన తెరహు కుటుంబికులు, నది అద్దరిన నివసించి యితర దేవతలను పూజించిరి (యెహోషువ 24 : 2). 75 సం॥ల యీడుగల వాడైనప్పుడు అబ్రాము తన భార్య యయిన శారయిని తన సహోదరుని కుమారుడైన 'లోతు'ను, హారానులో వారు సంపాదించిన యావదాస్తిని తీసికొని కనాను దేశమునకు వచ్చెను. తెరహు హారానులో నిలిచి అబ్రాము వెళ్ళిన 60 సం॥లకు, హారానులోనే చనిపోయెను. ఎబు బ్రాటిక్ అను బైబిలు పండితుడు, "యూదుల పురాతన సాంప్రదాయములు" అను గ్రంథములో - తెరహుకు యిద్దరు భార్యలనియు - 'యోనా' అను భార్యవలన 'అబ్రాము' పుట్టెననియు. ఆమె చనిపోయిన తరువాత రెండవ భార్య 'లెహావిట'కు 'శారయి' పుట్టెనని వ్రాసియున్నదని తెలిపెను. గనుక అబ్రాముకు శారయి ఒకవిధముగా చెల్లెలనుమాట నిజమే- "నాతండ్రి కుమార్తెగాని నా తల్లి కుమార్తెకాదు - ఆమె నాకు భార్య యైనదని" అబ్రాము చెప్పెను (ఆది 20 : 12). అరబీ దేశీయులలోను, మహమ్మదీయులలోను, పాతనిబంధన కాలములో యిశ్రాయేలీయులలోను, ఒక తల్లి గర్భమున పుట్టిన చెల్లి కాకుండా, వరసకు చెల్లెలైన వారిని వివాహము చేసికొనుట తప్పుకాదు (2 సమూయేలు 13 : 12-14).

అబ్రాహాము శారాలకు గల ఈ రెండవ వరసను రెండు సందర్భములలో అబ్రాహాము ఉపయోగించుకొనినట్లు పాతనిబంధనలో

చూడగలము. దేవుడు తనతో చెప్పినట్లు అబ్రాహాము తన తండ్రి యిల్లు విడచి దూరదేశము పోవుచున్నపుడు, తాను ప్రయాణము చేయు స్థలములందు దేవుని భక్తి ఏ మాత్రము లేదు గనుక, తన భార్య నిమిత్తము తనను చంపుదురనుకొని - అబ్రాహాము, శారాను చూచి - "మనము పోవు ప్రతి స్థలమందు యితను నా సహోదరుడని నన్ను గూర్చి చెప్పుము - నీవు నాకు చేయవలసిన ఉపకారమిదేయని చెప్పెను" (ఆది 20 : 11, 13).

వారు కనానులో నున్నపుడు అచట కరువు వచ్చెను. కరువు భారముగా నున్నందున ఐగుప్తులో నివసించుటకు వెళ్ళిరి-ఐగుప్తీయులు, శారా మిక్కిలి సౌందర్యవతి యయి వుండుటచూచి ఫరో యెదుట ఆమెను పొగడిరి గనుక ఆమె ఫరో యింటికి తేబడెను (బైబిలులోని లెక్క ప్రకారము శారా వయస్సు అప్పటికి 60 సం॥ వుండినను, అమె అంత సౌందర్యముగా వుండుట ఆశ్చర్యమే). కాని దైవ నిర్ణయములో ఆమెను 'జనములకు జననిగాను, జనముల రాజులు ఆమె నుండి వచ్చునట్లుగాను, ఆమె కుమారుడైన ఇస్సాకుతో దేవుడు తన నిబంధనను స్థిరపరచు నట్లుండగా - ఫరో యొక్క అధికారమును, ఆలోచనయు అట్టి దైవ నిర్ణయమునకు తల యొగ్గ వలసి వచ్చెను. గనుక ఫరో, శారాను అబ్రాహాము నొద్దకు పంపివేసెను - అంతేగాక అబ్రాహామునకు, గొర్రెలు, గొడ్లు, దాసులు పనికత్తెలు, గాడిదెలు ఒంటెలు యివ్వబడెను. ఈ సంగతి రాబోవు దినములలో అబ్రాహాము శారాల సంతానమైన ఇశ్రాయేలు జనాంగముకూడా, అప్పటి ఐగుప్తురాజైన ఫరో దాస్యము నుండి తన కుమారుడైన యిశ్రాయేలునప యెహోవా దేవుడు అద్భుత రీతిగా విడిపించి "వీరు ఎవరికి దాసులవుదురో ఆ జనమునకు తీర్పు తీర్చి ఐగుప్తీయులను కొల్లగొట్టి మిక్కిలి ఆస్తితో బయలు దేరదీసి-" ఇశ్రాయేలీయులను నెలుపలకు తెచ్చుటకు ముంగుర్తుగా జరిగెను (ఆది15:14 నిర్గమ 11:2, 12:35-36),

తరువాత ఆదికాండములో మరల శారాను గూర్చి - ఇష్మాయేలు, ఇస్సాకుల పుట్టుక సందర్భములో మనము వినుచున్నాము - "నేను సంతానము లేనివాడనై పోవుచున్నానే" అని అబ్రాహాము చింతించుచుండగా - యెహోవా అతనిని వెలుపలికి తీసికొనివచ్చి-నీవు ఆకాశము వైపు తేరి చూచి, నక్షత్రములను లెక్కించుటకు నీ చేతనైతే లెక్కించుమని చెప్పి - నీ సంతానము ఆలాగవునని చెప్పెను. అతడు యెహోవాను నమ్మెను - అది అతనికి నీతిగా ఎంచబడెను. (ఆది 15 : 2-6).

శారా తనకు పిల్లలు కలుగక పోవుట వలన తొందరపడి "ఇదిగో నేను పిల్లలు కనకుండ యెహోవా చేసియున్నాడు. నీవుదయచేసి నా దాసితో పొమ్ము, ఒక వేళ ఆమె వలన నాకు సంతానము కలుగవచ్చునని - అబ్రాహాముతో చెప్పెను, అతడు శారా మాటవినెను (ఆది 16 : 1-2). "నీవు నా సహోదరివని దయచేసి, మనము వెళ్ళిన క్రొత్త ప్రదేశములలో చెప్పుమని" అబ్రాహాము శారాను కోరెను (ఆది 12 : 13, 19, 20 : 2, 5, 12) ఆ విధముగా చెప్పుటవలన శారా, ఫరో యింటికిని, అబీమెలెకు యింటికిని కొనిపోబడుట జరిగెను. గనుక-తను గొడ్రాలై నందున (ఆది 11 : 30) తనను వదలించుకొని, వేరొక స్త్రీ వలన సంతానము పొందుటకు తనను ఈ విధముగా చెప్పమనుచున్నాడేమోనని అనుమానము శారాకు కలిగియుండవచ్చును. దానిని బట్టి వారు ఐగుపును విడచి వచ్చుచున్నప్పుడు వారికి ఫరో వలన యివ్వబడిన దాసి హాగరు - యవనస్తురాలు, చక్కనిది - గుణవంతురాలు - తనకు అణుకువగానున్నది. తనేమో వృద్ధురాలు, తన యజమానియైన అబ్రాహాముకు ఒక వారసుని ఇచ్చుటకు అశక్తురాలై యుండెను. అప్పటి కాలములోని ఆచార ప్రకారము, భార్య ఏ కారణముచేతనైనను బిడ్డలకు కనజాలకపోయినట్లయిన, భర్తకు వారసుఉండుటకై బిడ్డను కనుటకు యింకొక స్త్రీని తనే ఏర్పాటు చేయవలసినట్లు

బైబిలు నందు చూడగలము (ఆది 30 : 1-5, 30 : 9). అందుకుగాను, యవనస్తురాలు, పరాయి దేశస్తురాలైన క్రొత్తదాసిని ఎన్నుకొనుట ఉత్తమమని శారా తలంచియుండును.

శారా దాసియైన ఐగుప్తీయురాలగు హాగరు అబ్రాహామునకు ఇష్మాయేలును కనినప్పుడు అబ్రాహాము 86 సం॥ల వాడు (ఆది 16:16). తన విషయమై దేవుని ఏర్పాటునకు వేచియుండక, చేసిన ఇట్టి తొందర పాటు పనివలన శారా తరువాత చింతించవలసి వచ్చెను. చివరకు హాగరును, ఆమె కుమారుడైన ఇష్మాయేలును వెళ్ళగొట్టవలసి వచ్చెను. అబ్రాహాము 99 సం॥ల వాడైనపుడు గెరారులో కొన్నాళ్ళు వుండెను. గెరారు రాజైన అబీమెలెకు శారాను తన యింటికి పిలిపించుకొనెను - అయినను రాత్రి వేళ దేవుడు స్వప్నమందు అబీమెలెకు నొద్దకువచ్చి. నీవు చేర్చుకొనిన స్త్రీ ఒక పురుషుని భార్యగనుక ఆమె నిమిత్తము నీవు చచ్చినవాడవు సుమీ ... ... కాబట్టి ఆ మనుష్యుని భార్యను తిరిగి అతనికి అప్పగించుము. అతడు ప్రవక్త. అతడు నీ కొరకు ప్రార్థన చేయును లేని ఎడల నీ వారందరు నిశ్చయముగా చచ్చెదరని చెప్పెను (ఆది 20 : 1-3, 7). బైబిలునందు సూచించిన లెక్కల ప్రకారము అప్పటికి శారా వయస్సు సుమారు 80 సం॥లు వుండెను. అప్పుడు అబీమెలెకు శారాను ఎందుకు కోరుకొన్నాడోనని చాలా మందికి ఆశ్చర్యముగా నుండును. గాని అబ్రాహాము తన పరివారముతో, ఏలాము రాజైన కదొర్లాయోమెరును అతనితో నున్న రాజులను, దాను మట్టుకు తరిమి హతము చేయగలిగెను, గనుక అట్టి పరాక్రమశాలితో స్నేహము చేసికొనుటకు, అబ్రాహాము చెల్లెలుగా చెప్పుకొనబడుచున్న శారాను పెండ్లాడి బంధుత్వము పొందగోరెను (ఆది 14 : 1-17, 20 : 10-18).

[సశేషము]

## క్రీస్తు యొక్క అపొస్తలులు

### *( The Apostles of Christ )*

క్రీస్తు యొక్క అపొస్తలులను గూర్చి మనము బైబిలునందు చదువగలము, అపొస్తలుడను మాట 'అపొస్టలాస్' అను గ్రీకు పదము నుండి వచ్చినది. అపొస్తలుడనగా పంపబడిన వాడని యర్థము. మరి ముఖ్యముగా ఒక ప్రత్యేక పని నిమిత్తము పంపబడినవాడని యర్థము. సువార్త ప్రకటించుటకు పంపబడు నిమిత్తము యేసు 12 మందిని నియమించుకొనెను (మార్కు 3 : 14). అందువలన వారు అపొస్తలులనబడిరి. అపొస్తలులను గూర్చి మనము చాల నిర్లక్ష్యము చేయుచున్నాము. వారిని గూర్చి మనము తెలిసికొన గలిగిన దంతా తెలిసికొనలేక యున్నాము. యేసు వారిని నియమించెను, వారి కాయన బహు జాగ్రత్తగా ఉపదేశించెను మరియు ఆయన ఈ లోకములో పరిచర్య చేసిన కాలములో వారికి శిక్షణ నిచ్చెను. ఆయన వారి సాధక బాధకములను సహించెను మరియు ఈలోకాని కంతటికీ సువార్తను ప్రకటించు బాధ్యతను వారి కప్పగించెను. అందువలన వారు ప్రాముఖ్యమైన వారని మనము గ్రహించుకొన గలము.

ఆ పండ్రెండుగురి పేర్లు యివి: సీమోను పేతురు, యాకోబు, యోహాను, అంద్రెయ, ఫిలిప్పు, బర్తొలొమయి, మత్తయి, తోమా, అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయి, సీమోను, ఇస్కరియోతు యూదా అనువారు (మార్కు 3 : 16-19).

ఈ పన్నెండుమంది అపొస్తలులు ఆనాటి యూదా మతగురువులలో నుండి నియమింపబడినవారు కారు. వారు నిమ్నజాతులలో నుండి యేర్పరచుకొన బడినవారు కూడ కాదు. గాని వారు సామాన్య ప్రజలలో నుండి, అనగా యేసు యొక్క వాక్యములను ఆనందముతో వినిన సామాన్య ప్రజలలో నుండి యేర్పరచుకొన బడిరి. రబ్బీలవలె వారు విద్యావంతులు కాదుగాని వారు పామరులు మాత్రము కాదు.

ఏలయనగా యూదుల పిల్లలందరికీ సమాజ మందిరపు పాఠశాలలలో ఆనాడు విద్యాభ్యాసము చేయబడుచుండేది గనుక వీరు విద్యలేని పామరులు మాత్రము కాదు.

వారిలో కొందరు, అనగా పేతురు, అంద్రెయ, యాకోబు, యోహానులు జాలరులు. సీమోను ఒక దోనెను కలిగియుండెను. ఈ దోనెలలో తమతో పనిచేయుటకు వారు కొంతమంది జీతగాండ్రను కలిగి యుండిరి. దీనిని బట్టి వీరు ఆర్థికముగాను, వ్యాపారరీత్యాకూడా వెనుకబడినవారు కారని అర్థమగుచున్నది (మార్కు 1 : 16-20; లూకా 5 : 1-11). మత్తయి ఒక సుంకరి, అనగా పన్ను వసూలు చేయువాడు (మత్తయి 9 : 9; లూకా 5 : 27). అపొస్తలుల జీవితములను గూర్చి వారి వృత్తులను గూర్చి బైబిలు బహు స్వల్ప సమాచారమును మాత్రమే మనకు యిచ్చుచున్నది. వారి యొక్క వ్యక్తిగత చరిత్రకంటె వారి పనిని పరిచర్యను మనము ఎక్కువ తెలిసికొనుట మంచిది.

ద్రోహికంటె ద్వేషింపబడినవాడెవడు బహుశ ఉండడు. మరియు తన యజమానినే అప్పగించిన వాని జీవితము మరింత అసహ్యమైనది. అపొస్తలుల పట్టికలో ఇస్కరియోతు యూదా పేరు ఎప్పుడు ఆఖరిగానే కనబడును. క్రీస్తే అతనిని యేర్పరచుకొని మిగిలిన వారితో సహా కలసి శక్తినొంది యూదుల దగ్గరికి పంపబడెను (మత్తయి 10 : 4-15). ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా అను మాటలతో మత్తయి, మార్కు సువార్తలలో అతని పేరు కనబడును. ద్రోహియగు ఇస్కరియోతు యూదా అని లూకా అతని గూర్చి వ్రాసెను (లూకా 6 : 16). శిష్యుల సమూహపు డబ్బు సంచి అతని యొద్ద ఉండేది. వారి పనికవుసరమగు ఖర్చులను, వారి వ్యక్తిగత అవుసరముల నిమిత్తమగు ఖర్చులను అతడు చేయుచు యుండేవాడు. అతడు క్రీస్తుయొక్క మిత్రుడే యని చెప్పుకో బడుచున్నను అతడు

స్వార్థపరుడు, లోభి యని అగుపడుచున్నాడు. యేసు పాదములకు మరియు జటామాంసి అత్తరును పూసినప్పుడు అతడు అభ్యంతరము తెలిపెను. "యీ అత్తరెందుకు మూడువందల దేనారములకు అమ్మి బీదల కియ్యలేదనెను. వాడీలాగు చెప్పినది బీదలమీద శ్రద్ధకలిగి కాదు గాని వాడు దొంగయై యుండి తన దగ్గిర డబ్బుసంచి యుండినందున అందులో వేయబడినది దొంగిలించుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను" (యోహాను 12:1-6). ఇస్కరియోతు యూదా 12 మంది అపొస్తలులలో ఒకనిగా లెక్కింప బడుటయే గాకుండ 'యీ పరిచర్యలో పాలుపొందెనని' పేతురు చెప్పెను (అపొ. కా. 1:17).

ఇస్కరియోతు యూదాలో సాతానుడు ప్రవేశించెను (యోహాను 13:26). డబ్బుకొరకతడు ప్రభువు నప్పగించెను (మత్తయి 26:15). అటు తరువాత ఉరి పోసుకొని చచ్చెను (మత్తయి 27:5). అతని పాపమును గూర్చి పేతురు చెబుతు యూదా తప్పి పోయెనని చెప్పెను (అపొ. కా. 1:25).

యూదా తప్పిపోయి పోగొట్టుకొనిన పరిచర్యలోను, అపొస్తలుల తత్వములోను పాలు పొందుటకు మత్తీయ అను నతడు ఏర్పరచుకొన బడుటను అపొ. కా. మొదటి అధ్యాయములో మనము చూడగలము (అపొ. కా. 1:25). అపొస్తలుడగువాడు క్రీస్తుయొక్క పునరుత్థానమును గూర్చి సాక్షియై యుండుట అత్యవుసరమని పేతురు పలికెను (అపొ. కా. 1:22). అట్టి అర్హతగల వారిలో ఇద్దరిని అనగా బర్సబ్బా అనబడిన యోసేపును, మత్తీయ అనువారిని వారు నిలువబెట్టి యిద్దరిలో నీవు ఏర్పరచుకొనిన వానిని కనబరచుమని ప్రార్థనచేసి వారిని గూర్చి చీట్లువేయగా మత్తీయ పేరిట చీటి వచ్చెను గనక అతడు పదునొకండు అపొస్తలులతో కూడ లెక్కింపబడెను (అపొ.కా. 1:21-26).

ఈ 12 మంది అపొస్తలులను గూర్చియే గాక అపొస్తలుడైన పౌలును గూర్చి కూడ మనము క్రొత్తనిబంధనలో చదువగలము. అపొస్తలుడగువాడు ప్రభువును చూచినవాడై యుండవలెను. పౌలు ప్రభువును చూచెను. మన ప్రభువు ఈ లోకమందున్నప్పుడు అతడాయనచే ఉపదేశింప బడకపోయినను అతడు పునరుత్థానుడైన ప్రభువును చూచెను. ఆయన "అందరికి కడపట ఆకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెను" అని పౌలు 1 కొరింథీ 15:8 లో చెప్పెను. పౌలు తరువాత ఇంకెవరయిన అపొస్తలులున్న యెడల ఆయన అందరి కంటె కడపట అతనికి కనబడకపోవును. ఆఖరిగ ఆయన పౌలుకు కనబడిన యెడల అటు తరువాత ఇంకెవరికి ఆయన అగుపడలేదు. అందువలన ఈనాడు కొందరు తమ సంఘములలో అపొస్తలులను కలిగి యుండుట, అపొస్తలుల మని కొందరు పిలువబడుట లేఖన విరుద్ధమైన సంగతి. ఆకాలమందు పుట్టిన వాడను అని పౌలు తనను గూర్చి చెప్పుకొనుటలో, అతడు సామాన్యముగా అందరి అపొస్తలులవలెగాక అసామాన్యముగా చేయబడిన అపొస్తలుడనని చెప్పుచున్నాడు. ప్రభువు మరణించిన ఆ కొద్ది సంవత్సరముల కాలములోనే అతడు ఆకాలమందు పుట్టినట్టున్నవాడని అనుకొనిన యెడల ప్రభువు చనిపోయిన రెండువేల సంవత్సరముల తరువాత తాము అపొస్తలులమని చెప్పుకొనువారి సంగతి యేమి? అట్టివారు దొంగ అపొస్తలులేగదా?

దమస్కుకు వెళ్లు మార్గమున ప్రభువు పౌలుకు కనబడి, "నీవు నన్ను చూచియున్న సంగతిని గూర్చియు నేను నీకు కనబడబోవు సంగతిని గూర్చియు నిన్ను పరిచారకునిగాను సాక్షినిగాను నియమించుటకై కనబడియున్నాను" అని చెప్పెను (అపొ.కా. 26:16). అపొస్తలత్వమునకు పౌలును ఏ మానవుడు గాక ప్రభువే పిలిచెను. "మనుష్యుని మూలముగానైనను ఏ మనుష్యుని వలననైనను గాక యేసుక్రీస్తు

వలనను, దేవుని వలనను అపొస్తలుడుగా నియమింపబడిన పౌలను నేను..." అని అతడు గలతీయులకు తన్ను తాను పరిచయము చేసికొనెను (గలతీ 1:1). మిగిలిన అపొస్తలులవలె దేవుని బయల్పాటు వలన అతడు సువార్తను పొందెను, "నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియ చెప్పుచున్నాను. మనుష్యునివలన దానిని నేను పొందలేదు, నా కెవడును దానిని బోధింపను లేదుగాని యేసుక్రీస్తు బయలుపరచుట వలననే అది నాకు లభించినది" అని అతడు చెప్పెను (గలతీ 1:12). మిగిలిన అపొస్తలులు అతని కేమియు ఉపదేశించలేదు (గలతీ 2:16) అతడు అన్య జనులకు సువార్తను బోధించుటకై ప్రత్యేకముగా ఏర్పరచుకొన బడిన అపొస్తలుడు (గలతీ 2:7-9).

అపొస్తలులు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను బోధించుటకై ఏర్పరచుకొన బడినవారు. వారు బోధించినది క్రీస్తు సువార్త. ఆ సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడునని యేసు చెప్పెను. నీవు సువార్తకు లోబడితివా ?

—జాషువా గూటం.

---

## బాప్తిస్మము యొక్క ప్రయోజనము
## (*The Purpose of Baptism*)

బాప్తిస్మము ఒక బైబిలు అంశము. లేఖనములలో అది విపులముగా విశదపరచబడినను అనేకులు దానిని అపార్థము చేసికొనిరి. వారు దాని ప్రయోజనము నెరుగనందున అది ఒక ప్రాధాన్య సమస్యగా నున్నది. దేవుని వాక్యము దానిని గూర్చి ఏమి బోధించుచున్నది ?

మొట్టమొదటిగా ఒకే ఒక్క బాప్తిస్మము ఉన్నదని గ్రహించు దము (ఎఫెసీ 4:5). యోహాను బాప్తిస్మము, శ్రమల బాప్తిస్మము మొదలగునవి యుండెను. కాని పౌలు క్రీ॥ శ। 64 సం॥లో ఈ సంగతి వ్రాయుసరికి ఒకే బాప్తిస్మముండెను. మనము చేయవలసినదంతా అపొస్తలుల కార్యములను తిరుగవేసి అందు మార్పు చెందినవారి సందర్భములను పరీక్షింపవలయును. అట్లు చేసినప్పుడు బాప్తిస్మము ఒక సమాధియని, అది నీటి సమాధియని అది పాపములను కడిగి వేయునని, పాపక్షమాపణకొరకని, ప్రభువు దానిని ఆజ్ఞాపించెనని మనము కనుగొందుము (అపొ.కా. 8.27 - 39; 22:16; 2:38; 10:48).

లేఖనములనుబట్టి బాప్తిస్మమునకున్న ప్రయోజనముల నిప్పుడు పరిశీలించుదము: 1. విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు జరిగించిన తరువాత ఒకడు రక్షింపబడుటకు బాప్తిస్మము పొందవలెను. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడునని" క్రీస్తే చెప్పెను (మార్కు 16:16). బాప్తిస్మము తరువాతనే రక్షణను క్రీస్తు ఉంచెను గాని దానికి ముందు కాదు. నమ్మనివాడు శిక్ష తప్పక నొందును. అయితే రక్షింపబడుటకు ఒకడు నమ్మి బాప్తిస్మమును పొందవలయును. మరల పేతురు ఇట్లు వ్రాసెను: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది. అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని, యేసు క్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మన స్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21). బాప్తిస్మము రక్షించుటలేదు అని ఎవరు చెప్పగలరు?

2. బాప్తిస్మము పాపక్షమాపణకొరకై యున్నది. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు అని పేతురు బోధించెను" (అపొ.కా. 2:38).

3. బాప్తిస్మము పాపములను కడిగివేయును, "గనుక నీవు తడవుచేయుట యెందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" అని పౌలు హెచ్చరించబడెను (అపొ.కా. 22:16).

4. బాప్తిస్మము ఒకని క్రీస్తు రక్తములోనికి చేర్చును. పౌలు రోమీయులకును, గలతీయులకును యిట్లు వ్రాసెను: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" (రోమా 6:3). "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించియున్నారు." (గలతీ 3:26, 27). ఎవడైనను బాప్తిస్మము పొందకమునుపే రక్షింపబడితినని చెప్పుకొనుచున్నయెడల అతడు క్రీస్తునకు వెలుపల ఉండి రక్షింపబడెనని, అతడు క్రీస్తు లేనివాడని చెప్పుకొనుచున్నట్లు గ్రహింపవలసియున్నది. అబద్ధపుసిద్ధాంతములద్వారా ఒకని క్రియలు ఇట్లు ఒప్పుకొనుట జరుగును.

5. బాప్తిస్మము ఒకని సంఘమందు చేర్చును. "ఏలాగనగా యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి" (1 కొరింథి 12 : 13). ఇక్కడ చెప్పబడిన శరీరము సంఘమై యున్నది (కొలస్స 1:18). ఇక్కడ చెప్పబడిన బాప్తిస్మము పరిశుద్ధాత్మ బాప్తిస్మము కాదుగాని అది నీటి బాప్తిస్మము. ఒకని సంఘములో చేర్చుటకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎన్నడు ఈయబడలేదు; కాని ఆత్మ వాక్యముద్వారా యిచ్చు నడిపింపునుబట్టి ఒకడు శరీరములోనికి లేదా సంఘములోనికి బాప్తిస్మము పొందును.

6. బాప్తిస్మమునందు ప్రభువుయొక్క మరణము సమాధి, పునరుత్థానముల సాదృశ్యములున్నవి (1 కొరింథి 15 : 1-4). క్రీస్తు సిలువపై మరణించినట్లు, పాపి తన పాపముల విషయమై మరణించును.

క్రీస్తు సమాధిలో పాతిపెట్టబడినట్లు అతడు నీటిలో పాతిపెట్టబడును. క్రీస్తు సమాధినుండి పునరుత్థానుడైనట్లు, అతడు ప్రభువునందు నూతన పురుషుడై లేచును (2 కొరింథి 5:17; రోమా 6:1-12).

7. బాప్తిస్మము క్రొత్త జన్మను కలిగించును. "యేసు యిట్లనెను - ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5). ఇది ఆత్మ బాప్తిస్మముకాదు గాని నీటి బాప్తిస్మమని మనము గమనించుచున్నాము. ఆత్మ వాక్యము ద్వారా పనిచేయుచు మనలను నడిపించుటచే ప్రభువు రాజ్యము లేక సంఘములోనికి ప్రవేశించుటకు బాప్తిస్మమును పొందుట అవసరమని మనకు బోధింపబడినది. మరల 2 కొరింథి 5:17, 1 పేతురు 1:21-22 లను చదువుము.

—జె.సి. ఛోట్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To.

..................................

..................................

..................................

..................................